## క్లుప్తంగా

### నేడు వైద్య శిబిరం

పొందూరు: ఈ నెల 27న మండలంలోని మజ్జిలిపేట గ్రామంలోని కోదండరామాలయంలో చినజీయర్‌స్వామి వారి వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు వికాస తరంగిణి సమన్వయకర్త కె.మధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ఆరోగ్య రక్షణ గురించి అవగాహన కల్పించడం, వీఐఏ పరీక్షలు చేయడం, కాల్పోస్కోపీ ద్వారా గర్భాశయ పరీక్షలు చేయడం, తదితర పరీక్షలు నిర్వహించడం, సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

### పరిశుభ్రతపై అవగాహన



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రాజేశ్వరరావు

పాతపట్నం: పరిసరాలు పరిశుభ్రత, పారిశుధ్యంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూపరింటెండెంట్ బి.రాజేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో సీసీఎస్, వీఓఏఎస్‌లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం పి.మనోరత్నం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వీధుల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఏపీఎం టి.పార్వతి, బి.సత్యవతి, శ్రీధర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీదీప్

ఎల్.ఎన్.పేట: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గిరిబాల, తురకపేట ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి డాక్టర్ ఎ.లక్ష్మీదీప్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, వైకేపీ ఏపీఎం ఎస్.రవిరాజ్ పాల్గొన్నారు.

### ఊరటనిచ్చిన వర్షం



మెళియాపుట్టిలో కురుస్తున్న వర్షం

మెళియాపుట్టి: మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాలలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం పడింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం రైతులకు కాస్త ఊరటనిచ్చింది.

### బాధ్యతల స్వీకరణ



డాక్టర్ సుజాత

పొందూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పేడాడ సుజాత బుధవారం బాధ్యతలు చేపట్టారు. మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ రామదాస్‌ను ఆ బాధ్యతల నుంచి వైద్యాధికారులు తప్పించి సుజాతకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డాక్టర్ సుజాత పొందూరు ప్రభుత్వ ఆస్పత్రిలోనే గైనకాలజిస్టుగా పని చేస్తున్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద పద్మారం గ్రామంలో గల త్రినాథస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయలంలో మొదటి హారతితో పూజలు ప్రారంభించారు. వేదమంత్రాలతో ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహణతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

### రికార్డులు పక్కాగా నిర్వహించాలి

హిరమండలం: రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఏపీఎం సుబ్బయ్యానాయుడు తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో ఏడు మండలాలకు సంబంధించి మహిళా సమాఖ్యలకు సంబంధించి బ్యాంక్ అకౌంట్లతోపాటు రికార్డులను బుధవారం పరిశీలించారు. మహిళా సమాఖ్యల రికార్డుల నిర్వహణలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. స్థానిక ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి, త్రినాథమ్మ, ఎల్‌సీలు శ్రీనివాస్, నాగభూషణం పాల్గొన్నారు.



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు



పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



హిరమండలం: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణస్వామి



ఆమదాలవలస: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వివేక్

# మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

● పలుచోట్ల అవగాహన ర్యాలీలు, సదస్సులు

నరసన్నపేట: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, సెబ్ సీఐ సతీష్‌కుమారు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి పోలీసులు బుధవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వైఎస్సార్ కూడలి, పాతబస్టాండ్, పోలాకి రోడ్డు కూడలి మీదుగా పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. సీఐలు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. నరసన్నపేట ఎస్‌ఐ అశోక్ బాబు, పోలాకి ఎస్‌ఐ అప్పారావు, సెబ్, స్థానిక పోలీస్ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో కలిసి కొత్తూరు సీఐ వేణుగోపాలరావు, సెబ్ ఎస్‌ఐ శ్రావణి, హిరమండలం ఎస్‌ఐ నారాయణస్వామి మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలేజీ నుంచి స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. స్థానిక పోలీస్‌స్టేషన్, సెబ్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.



పొందూరులో మానవహారం

పాతపట్నం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఎస్‌ఐలు బి.శ్రీనివాసరావు, యు.నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆల్‌ఆంధ్ర రోడ్ మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఈబీ పోలీసులు, అధ్యాపకులు పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేయాలని పాతపట్నం ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్ అన్నారు. పాతపట్నంలోని ప్రధాన కూడళ్లల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

పొందూరు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా పొందూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలిలో పోలీసులు, విద్యార్థులు, అంగన్‌వాడీ వర్కర్లు మానవహారంగా ఏర్పడ్డారు. జిల్లా ఎస్ఈబీ ఎడిషనల్ ఎస్పీ డి.గంగాధర్ ఆదేశాల మేరకు ఈ ర్యాలీని నిర్వహించినట్లు ఎస్ఈబీ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఆమదాలవలస: పట్టణంలోని సిద్ధార్థ ఐటీఐలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఆమదాలవలస సీఐ వివేక్ అవగాహన కల్పించారు. ఐటీఐ కాలేజ్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఈబీ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె.రాజారావు, సబ్ ఇన్స్‌పెక్టర్లు కరుణ, లత, నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హిరమండలం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నారాయణస్వామి సూచించారు. స్థానిక రామేశ్వరి డిగ్రీ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చాలామంది మత్తు బారిన పడి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పోలీస్ సిబ్బంది, కాలేజీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కొత్తూరు: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, పోలీసులు, అధ్యాపకులు

# నవధాన్యాల సాగుతో నేల సారం

ఆమదాలవలస: నవధాన్యాల సాగుతో నేల సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ అసిస్టెంట్ సురేష్ అన్నారు. మండలంలోని చేపేనపేటలో రైతులతో నవధాన్యాల విత్తనాలను బుధవారం పొలంలో చల్లించారు. ఓన్ ఫీల్డ్ కాంపాక్ట్ బ్లాక్ పరిధిలో 5 ఎకరాల విస్తీర్ణంలో నవధాన్యాల విత్తనాలను వేయించామని తెలిపారు. డీపీఎం రేవతి ఆదేశాల మేరకు నవధాన్య విత్తనాలను వేయించడానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నామన్నారు. ప్రస్తుతం వరి పంటకు ముందు నవధాన్యాలు వేసుకోవడం వల్ల నేలలో పంటలకు అవసరమైన సూక్ష్మ జీవుల వ్యవస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. పంట తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడి వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.




విత్తనాలు జల్లుతున్న రైతులు

# టీడీపీది కక్ష సాధింపు

● పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను టీడీపీ కూల్చివేస్తుందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జారీచేసిన జీఓల ఆధారంగానే చట్టబద్ధంగా స్థలాలు సేకరించి జిల్లా పార్టీ కార్యాలయల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. నోటీసులకు న్యాయపరంగా సమాధానం ఇచ్చేందుకు సమయం కూడా ఇవ్వటం లేదన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన నెల రోజులకే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. టీడీపీ నాయకుల చేతుల్లో వేధింపులకు గురైన వారికి అండగా ఉంటామన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక బ్రాహ్మణ వీధి కూడలివద్ద ఉన్న కేఎస్ఎం ప్లాజాలో బుధవారం ఎమ్మెల్యేకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూలై ఒకటో తేదీన సచివాలయ ఉద్యోగులతో ఇంటివద్దకే పింఛన్ పంపిణీ చేయనున్నామన్నారు. పాతపట్నంలో విద్యార్థుల కోసం ప్రభుత్వ పాలిటెక్నికల్, ఐటీఐ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు పైల బాబ్జి, సైలాడ సతీష్, ఎన్ని సన్యాసిరావు, కనకాల నారాయణ, శిర్ల ప్రభాకరరావు, యరుకోల కృష్ణారావు, నల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# రుణాలను డాక్యుమెంటేషన్ చేయాలి



మాట్లాడుతున్న వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ రవికుమార్

ఆమదాలవలస: స్వయం శక్తి సంఘాలకు గ్రామ సంఘాల ద్వారా మంజూరు చేస్తున్న అన్ని రకాల రుణాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్‌తో సహా సరైన డాక్యుమెంటేషన్ ఉండేలా చూడాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ పి.రవికుమార్ సూచించారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామ సంఘాల ద్వారా అందిస్తున్న సీఐఎఫ్ రుణాలకు శ్రీనిధి, ఉన్నతి రుణాలకు సభ్యురాలు, సంఘం వివరాలతో డాక్యుమెంటేషన్ తయారు చేసి మండల సమాఖ్యలో భద్రపరచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం పైడి కూర్మారావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, లీగల్ కోఆర్డినేటర్ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



మాట్లాడుతున్న క్వాలిటీ కంట్రోల్ డీఈ సతీష్‌బాబు

నరసన్నపేట: ఉపాధి పనుల్లో నాణ్యత తప్పలనిసరి అని క్వాలిటీ కంట్రోల్ డీఈ వి.సతీష్‌బాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఉపాధి నిధులతో చేపట్టే పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఏ మాత్రం తేడా వచ్చినా ఫీల్డ్ అసిస్టెంట్లే బాధ్యత అని అన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లకు ఆదేశించారు. ఉపాధి పనులు జరుగుతున్న తీరును ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీడీ పి.మురళీకృష్ణ సమీక్షించారు. పనులు చురుగ్గా నిర్వహించాలని, వేతనదారులకు పూర్తి వేతనాన్ని అందేలా కొలతలు ఇవ్వాలన్నారు. ఏపీఓ యుగంధర్, మండల ఇంజినీర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠ్య పుస్తకాలే అందజేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు ప్రభుత్వమే పాఠ్య పుస్తకాలు ముద్రించి ఇస్తుందని, దీనికి తగ్గట్టుగా డబ్బులు చెల్లించాలని నరసన్నపేట ఎంఈఓ శాంతారావు తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు నిర్ణయించారని, వీలున్నంత తొందరగా డబ్బులు చెల్లిస్తే పుస్తకాలు సరఫరా చేస్తామన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలను వివరించారు. ప్రైవేట్ స్కూళ్లలో ఇష్టానుసారంగా అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వమే పుస్తకాలు సరఫరా చేయనుందన్నారు. సాయంత్రం ప్రభుత్వ స్కూల్ హెచ్‌ఎంలతో ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు సమమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం అమలు, నేను బడికిపోతా కార్యక్రమాలపై సమీక్షించారు. స్టూడెంట్ కిట్లు పంపిణీ, పాఠశాల పరసరాల పరిశుభ్రత వంటి అంశాలపై ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ఆమదాలవలస: మండలంలోని కనుగులవలసలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో ఉన్న చెత్తను తొలగించారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ నూక రాజు పర్యవేక్షించారు.

కొత్తూరు: మండలంలోని 43 గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొత్తూరు మండల కేంద్రంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి పర్యవేక్షించారు.

## ఫిజియోథెరపీ వరం



చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు

హిరమండలం: ప్రత్యేకావసరాల గల చిన్నారులకు ఫిజియోథెరపీ వరమని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రత్యేకావసరాలగల చిన్నారులకు డాక్టర్ గ్రేస్ శాంతి ఫిజియోథెరపీ చేశారు. హెచ్‌ఎం కేశవరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారులను క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ శిబిరానికి తేవాలన్నారు. ఐఈఆర్టీ సీతన్నాయుడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పైనాపిల్ ఉత్పత్తులపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: పైనాపిల్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులపై గిరిజన యువతకు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలోశాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పైనాపిల్ క్యాండీని తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. జామ్, స్క్వాష్‌ను ప్యాకింగ్ చేయడం, లేబుల్, ఫుడ్ రిజిస్ట్రేషన్ ఎలా చేయించాలి తదితర విషయాలను వివరించారు. శాస్త్రవేత్తలు, వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ ఎస్.ఆనంద్, వసంత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాపై దృష్టి

హిరమండలం: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎంపీడీఓ డి.స్వరూపారాణి ఆదేశించారు. బుధవారం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షించారు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. జెడ్పీటీసీ బుచ్చిబాబు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు



గుండవల్లిపేట వద్ద చర్చిస్తున్న అధికారుల బృందం

నరసన్నపేట: జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రమదాలకు గల కారణాలను తెలుసుకుంటున్నామని టెక్కలి మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సంజీవరావు అన్నారు. మండలంలోని గుండవల్లిపేట వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించడం జరిగిందని, దీనికి గల కారణాలను తెలుసుకుంటున్నామన్నారు. గుండువల్లిపేట వద్ద రోడ్డును కమిటీ ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. తామరాపల్లి, జమ్ము కూడలి, కోమర్తి, పోతయ్యవలస, సత్యవరం కూడలి, జడూరు కూడళ్ల వద్ద కూడా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించి, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు స్థానికులతో మాట్లాడారు. స్థానికులకు అవగాహన కల్పించారు. రోడ్డు దాటుతున్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్అండబీ ఏఈ రాజశేఖర్, నరసన్నపేట ఏఎస్‌ఐ తులసీరావు, ఎన్‌హెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

# 300 ఎకరాల్లో మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న ఏపీడీ శైలజ

మెళియాపుట్టి: జిల్లా అధికారులు ఇచ్చిన లక్ష్యాల మేరకు మండల వ్యాప్తంగా 300 ఎకరాల్లో మొక్కలు నాటాలని టెక్కలి ఏపీడీ శైలజ అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్షించారు. పీడీ చిట్టిరాజు ఆదేశాల మేరకు పనిచేయాలని, మండలంలో ఇప్పటికి 130 ఎకరాల్లో మాత్రమే మొక్కలు నాటడానికి అంచనాలు ఇచ్చారని, ఇంకా 170 ఎకరాల కోసం రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్, రైతులకు హార్టికల్చర్, ప్రభుత్వ భవనాల వద్ద మొక్కలు నాటడానికి ప్రణాళికలు వేయాలన్నారు. ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు జరగాలని, ఫారం పాండ్స్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఆలయాల వార్షికోత్సవాలు



సారవకోటలో ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్తలు, భక్తులు

సారవకోట: మండలంలోని సారవకోట, వడ్డినవలస గ్రామాల్లోని అభయాంజనేయస్వామి ఆలయాల వార్షికోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సారవకోటలో ఆలయ ధర్మకర్తలు చిన్నాల మాధవరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వడ్డినవలసలో ఇప్పిలి గణపతిరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పురోహితులు మనోజ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక, విశేష పూజలు, హోమం నిర్వహించారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ఆలయ ధర్మకర్తలు, ఇప్పిలి ఆంజనేయ ప్రసాద్, రవి, వేణు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కేంద్రాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గు రమణమూర్తి

నరసన్నపేట: యువతలో నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యువతకు అవసరమైన నైపుణ్యం అందించే ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం జులై ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ అవుతుందని, కార్యకర్తలు దీంట్లో భాగస్వామ్యం కావాలన్నారు. అన్నా క్యాంటీన్లు విడతల వారీగా అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణ నిమిత్తం ఒక ట్రస్టు ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా విరాళాలు సేకరించనున్నట్లు తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గంలోని సమస్యలపై దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా స్వగ్రామం మబగాంకు వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు స్వాగతం పలికారు.